రైతుల సహకారం అభినందనీయం..

- పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్
- కొడంగల్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటుకు స్థలం అందించిన రైతులకు పరిహారం పంపిణీ
- రూ. 10లక్షల చెక్కు, 125 గజాల స్థలం, ఇంటికో ఉద్యోగం

రైతులకు చెక్కుతో పాటు ఇంటి స్థల పత్రాలను అందజేసే కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి తదితరులు

కొడంగల్, సెప్టెంబర్ 4 : మండలంలోని అప్పాయిపల్లిలో ప్రభుత్వం తలపెట్టిన మెడికల్, వెటర్నరీ, నర్సింగ్ కళాశాలల నిర్మాణానికి స్థలాన్ని అందించిన రైతులకు రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం కొడంగల్‌లోని కడా కార్యాలయంలో స్థలం అందజేసిన రైతులకు నష్టపరిహార చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కొడంగల్ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు. ఇందులోభాగంగా మెడికల్, వెటర్నరీ, నర్సంగ్ కళాశాలల ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారని, రైతులు స్థలం అందించడం సంతోషకరమన్నారు. మెడికల్, నర్సింగ్ కళాశాలల ఏర్పాటుతో ఈ ప్రాంతంలో విద్యా వసతులు పెరిగి అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు.

మెడికల్ కళాశాల ఏర్పాటుకుగాను సర్వే నంబర్ 19లో మొత్తంగా 51మంది రైతులు సుమారు 55 ఎకరాల భూమిని అందించారని, వీరికి ప్రభుత్వం పారితోషికంగా ఎకరాకు రూ. 10 లక్షలతోపాటు 125 గజాల ఇంటి స్థలాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా కళాశాల ఏర్పాటు తరువాత అర్హతలను బట్టి ఇంటికో ఉద్యోగం అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు నందారం ప్రశాంత్, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, రైతులు పాల్గొన్నారు.

మట్టి గణపతులనే పూజిద్దాం..

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక పిలుపు

కలెక్టరేట్‌లో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ) : పర్యావరణాన్ని పరిరక్షించడానికి మట్టి గణపతులనే పూజిద్దామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో కలిసి కలెక్టర్ మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మట్టితో తయారు చేసిన గణనాథులను ఏర్పాటు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ జి.శ్రీవాస్తవ, ఏఈ ఎస్ఆర్ మహేశ్, తదితర అధికారులు పాల్గొన్నారు.

'ఇందిరా మహిళ' ద్వారా రుణాలు

- సెర్ప్ సీఈవో దివ్య ఐఏఎస్ వెల్లడి
- ఇన్ముల్‌నర్వలో మహిళా సంఘాల కుండల తయారీ పరిశీలన

కుండల తయారీపై మహిళా సంఘం సభ్యులతో మాట్లాడుతున్న సెర్ప్ సీఈవో దివ్య ఐఏఎస్

కొత్తూరు, సెప్టెంబర్ 4: ఇందిరా మహిళా కార్యక్రమం ద్వారా మహిళా సంఘాలకు రుణాలు అందజేస్తామని సెర్ప్ సీఈవో దివ్య ఐఏఎస్ తెలిపారు. బుధవారం కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వ గ్రామాన్ని సెర్ప్ సీఈవో దివ్య సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళా సంఘాలు నిర్వహిస్తున్న కుండల తయారీ పరిశ్రమ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ తయారు చేసిన కుండలను ఎలా? మర్కెటింగ్ చేస్తారని మహిళలను అడిగి తెలుసుకున్నారు. మట్టి పాత్రల తయారీ విధానంలో కొత్త టెక్నాలజీని వాడుకునే క్రమంలో సహాయ సహకారాలు అందిస్తామని ఆమె వివరించారు. అంతేకాకుండా ఇందిరా మహిళా కార్యక్రమం ద్వారా మహిళా సంఘాలకు పాడి పశువులు, నాటుకోళ్ల పెంపకం, పీఎం ఎఫ్ఎంఈ, మిల్క్ ప్రొడక్ట్స్, టైలరింగ్, బ్యూటీ పార్లర్, ఇతర వ్యాపారాలకు కావాల్సిన నైపుణ్య శిక్షణ, రుణ సహాయం అందజేస్తామని పేర్కొన్నారు. ప్రఖ్యాతి గాంచిన జేపీ దర్గాలో తాము తయారు చేసిన మట్టి పాత్రలను విక్రయిస్తామని మహిళ సంఘాలకు సభ్యులు సెర్ప్ సీఈవోకు వివరించారు. అలాగే ఆర్డర్‌పై హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లో వ్యాపారం చేసుకునే వారికి కూడా సప్లై చేస్తామని వివరించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ఏపీఎం కొండయ్య, సీసీలు రాజప్ప, ఖలీల్, లక్ష్మమ్మ, అలివేలు, వీఓఏలు, గ్రామ ఓబీలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, పాల్గొన్న వైద్యాధికారులు, సిబ్బంది

రంగారెడ్డి, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ) : సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం వైద్య ఆరోగ్యశాఖ జిల్లా కేంద్ర కార్యాలయంలో జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యాధికారులు, సూపర్‌వైజర్లకు సీజనల్ వ్యాధుల నియంత్రణపై తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జ్వర సర్వేను సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వదలడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. మాతాశిశు సంరక్షణ చర్యల్లో భాగంగా గర్భవతుల పేర్లను నమోదు చేయడంతోపాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. పుట్టిన ప్రతి బిడ్డకు వంద శాతం వాక్సినేషన్ చేయించాలని సూచించారు.

గ్రామాల్లో క్షయ వ్యాధి కొత్త కేసులను గుర్తించడంతోపాటు వ్యాధిగ్రస్తులకు చికిత్స అందేలా చూడాలన్నారు. సమీక్షా సమావేశంలో ప్రోగ్రాం అధికారులు, జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు

వికారాబాద్, సెప్టెంబర్ 4 : పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం వికారాబాద్ జిల్లాలోని ప్రభుత్వ,ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజనాభివృద్ధిశాఖ అధికారి పి.కమలాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఫ్రెష్, రెన్యువల్ పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్(ఉపకార వేతనల)కోసం ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే 8639388553 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు. విద్యార్థులు, సంబంధిత కళాశాలల యాజమాన్యాలు గమనించాలని సూచించారు.

గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

- వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి

పరిగి, సెప్టెంబర్ 4 : వినాయక ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం పరిగిలో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గణేశ్ మండపం ఏర్పాటుపై నిర్వాహకులు ముందుగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వినాయక ఉత్సవాలు శాంతియుతంగా, సామరస్యంగా జరుపుకునేందుకు పీస్ కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ప్రతిఒక్కరూ బాధ్యతగా మెలుగుతూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని ఎస్పీ సూచించారు. ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చే వాటిని నమ్మవద్దని, వాటిని నిర్ధారించుకున్న తర్వాత ఇబ్బందిగా ఉంటే పోలీసులను సంప్రదించాలన్నారు. ప్రతిఒక్కరూ పర్యావరణానికి మేలు చేసే మట్టి గణేశ్ విగ్రహాలనే ప్రతిష్ఠించాలని ఎస్పీ సూచించారు. పీఓపీతో నీటి కాలుష్యం ఏర్పడుతుందన్నారు.

రోడ్ల మరమ్మతులు చేపడతాం.. : మున్సిపల్ చైర్మన్ అశోక్

పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనం సందర్భంగా రోడ్ల మరమ్మతులు, ఇతర ఏర్పాట్లు చేపడతామన్నారు. సమావేశంలో పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, తహసీల్దార్ ఆనంద్‌రావు, ఎస్ఐ సంతోష్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ ఖాజ,నీటి పారుదలశాఖ ఏఈ రాఘవేంద్ర, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ వరలక్ష్మి, మాజీ ఎంపీపీ అరవిందరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎ.సురేందర్, వివిధ పార్టీల నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, అశోక్, క్రిష్ణ, హన్మంతు, పెంటయ్య, పరిగి పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల గణేశ్ మండపాల నిర్వాహకులు, హిందూ, ముస్లిం, క్రిస్టియన్ కమిటీల పెద్దలు, పాల్గొన్నారు.

డీజేకు అనుమతుల్లేవు : ఎస్పీ

తాండూరు : ఈనెల 7 నుంచి ప్రారంభమయ్యే గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం తాండూరులో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గణేశ్ ఉత్సవ కమిటీలు, హిందూ ఉత్సవ కేంద్ర సమితితోపాటు రాజకీయ పార్టీల నాయకులు, కులసంఘాల ప్రతినిధులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గణేశ్ ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీస్ బృందాల పర్యవేక్షణతో పాటు పట్టణంలో పలుచోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రోడ్లు, విద్యుత్ మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. మంటపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. డీజేకు అనుమతులు లేవని ఎస్పీ స్పష్టం చేశారు.

సమావేశంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐలు సంతోశ్‌కుమార్, అశోక్, హిందూ ఉత్సవ కేంద్ర సమితి అధ్యక్షురాలు, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి, నర్సింహులు, రాజుగౌడ్, వినాయక మండపాల నిర్వాహకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- స్థానిక అధికారులకు అదనపు కలెక్టర్ సుధీర్ ఆదేశం

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్, మండల ప్రత్యేకాధికారి సుధీర్

వికారాబాద్, సెప్టెంబర్ 4 : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్, మండల ప్రత్యేకాధికారి సుధీర్ తెలిపారు. బుధవారం వికారాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రధానంగా శానిటేషన్, నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో ఓటర్ జాబితా వివరాలను సరి చేయాలని పేర్కొన్నారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు పెంచే కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో వినయ్‌కుమార్, ఏపీవో శ్రీనివాస్, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో మందులు

- వికారాబాద్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పాల్వన్‌కుమార్

వికారాబాద్, సెప్టెంబర్ 4 : జిల్లాలోని అన్ని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రిలో కుక్క, పాము, తేలుకాటుకు మందులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన వారికి వాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. రైతులు, సాధారణ ప్రజలు గమనించి ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా పూర్తి ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రిలో వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. ప్రజలు మూఢనమ్మకాలను నమ్మవద్దని పేర్కొన్నారు. రక్తపోటు(బీపీ), మధుమేహం తదితర మందులు సైతం అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉన్నాయని, ప్రజలు అన్ని సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు.

మెడికల్ ఆఫీసర్ పోస్టులకు రేపు ఇంటర్వ్యూలు

కలెక్టర్ ఆదేశానుసారం జిల్లాలో ఖాళీగా ఉన్న 12 మెడికల్ ఆఫీసర్ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ పాల్వన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించబడుతుందన్నారు. అర్హత గల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. మొత్తం 12 మెడికల్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఎంబీబీఎస్ చేసి తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో తప్పనిసరిగా నమోదై ఉండాలని ఆయన పేర్కొన్నారు. అర్హులు హాజరు కావాలని తెలిపారు.

పాలాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలి

పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏఓ మోహన్‌రెడ్డి, ఏడీఏ శంకర్‌రాథోడ్

కొడంగల్, సెప్టెంబర్ 4 : ప్రస్తుత వర్షాలకు పంటల్లో నీరు నిలిచి నష్టపోయే ప్రమాదం ఉందని, నీరు నిల్వకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, ఏడీఏ శంకర్‌రాథోడ్ తెలిపారు. బుధవారం మండలంలోని రుద్రారం, టేకల్‌కోడ్ గ్రామాల్లో వారు పర్యటించి పంటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలను అందించారు. పంట పొలాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల పత్తి పంట రంగు మారే అవకాశం ఉందన్నారు. దీనిని అధిగమించేందుకు మొక్క వయస్సును బట్టి అధికారులు సూచించిన మందులను పిచికారీ చేసుకోవాలన్నారు. ఏఏ పంటలో ఎటువంటి మార్పులు, ఇబ్బందులు కలుగుతాయో వివరించి మందులను తెలియజేశారు.

కార్యక్రమంలో ఏఈవోలు శ్రీపతిరెడ్డి, ఆస్పాక్, దేవేందర్, రాజురాథోడ్, పావని, వసీం తదితరులు పాల్గొన్నారు.

అలుగు పారుతున్న బురాన్‌పూర్ చెరువు

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 4 : మండలంలోని బురాన్‌పూర్ పెద్ద చెరువు బుధవారం నిండి అలుగు పారుతున్నది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ నుంచి చెరువులోకి భారీగీ వరద రావడంతో పూర్తిస్థాయిలో నిండింది. దాంతో చెరువు కింద వంద ఎకరాలకుపైగా ఆయకట్టు యాసంగిలో సాగవుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బురాన్‌పూర్ పరిధిలోని చిన్నవాగు ప్రాజెక్టు మూడు రోజుల కిందటే నిండింది. దీని కింద 70 ఎకరాల ఆయకట్టు సాగవుతున్నది. వరుసగా రెండో ఏడాది కూడా చెరువులు నిండడంతో ఆయకట్టు రైతులు సంబురపడుతున్నారు.

రైతులు అధికారుల సూచనలు పాటించండి

- వ్యవసాయశాఖ జిల్లా అధికారి నరసింహారావు

గిర్విపల్లిలో రైతులతో మాట్లాడుతున్న డీఏఓ నరసింహారావు

కడ్తాల్, సెప్టెంబర్ 4: రైతులు పంటల సాగులో అధికారుల సలహాలు, సూచనలను పాటించాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి నరసింహారావు సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని గర్విపల్లి గ్రామంలో నష్టపోయిన జొన్న, పత్తి పంటలను బుధవారం ఏడీఏ ఆదిలక్ష్మితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏఓ రైతులకు పలు సూచనలు చేశారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వానలతో భూమి అంతా తడిగా మారిందని తెలిపారు. పంట చేలల్లో మురుగు నీటిని తీసి వేయాలని సూచించారు. భూమి ఆరిన తర్వాత తెగులు రాకుండా ఉండేందుకు, అధికారులు సూచించిన మేరకు మందులను పిచికారీ చేయాలని పేర్కొన్నారు. వరిలో కలుపు మొక్కలు విపరీతంగా పెరిగే అవకాశం ఉందని, పంట దిగుబడి తగ్గకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రేణుకాచక్రవర్తి, ఏఈవో శ్రీనాథ్, రైతులు పాల్గొన్నారు.

బండవెల్కిచర్లలో డీటీడబ్ల్యూవో పర్యటన

బండవెల్కిచర్లలో చెంచుకుటుంబాలతో మాట్లాడుతున్న డీటీడబ్లువో కమలాకర్‌రెడ్డి

కులకచర్ల, సెప్టెంబర్ 4 : మండలంలోని బండవెల్కిచర్ల చెంచు కుటుంబాల స్థితిగతులను జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కమలాకర్‌రెడ్డి తెలుసుకున్నారు. బుధవారం బండవెల్కిచర్ల చెంచుకాలనీలో పర్యటించిన అయన చెంచులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పీఎం జన్మాన్ ఆధ్వర్యంలో చెంచుల అభివృద్ధికి నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద గృహాలు, కమ్యూనిటీ భవనాలు, తదితర వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో బండవెల్కిచర్ల గిరిజన గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి, గిరిజన అధికారులు, చెంచుకుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

పదోన్నతులపై న్యాయ విచారణ జరుపాలి

విద్యుత్ ఉద్యోగుల మహాధర్నా

సిటీబ్యూరో, సెప్టెంబర్ 4 : విద్యుత్ ఉద్యోగుల పదోన్నతులపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎస్, ఎన్పీడీసీఎల్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు బుధవారం విద్యుత్ సౌధలో మహాధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ కోడెపాక కుమార స్వామి మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో కండీషన్ల పేరుపై కల్పిస్తున్న పదోన్నతులపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ లేదా? జ్యూడీషియల్ ఎంక్వైరీ చేయించాలన్నారు. విద్యుత్ సంస్థల్లో నేరుగా నియమించబడుతున్న ఉద్యోగుల సీనియార్టీ మెరిట్ ఆధారంగా ప్రకటించాలన్నారు.

ధర్నాలో కో చైర్మన్ ఆర్.సుధాకర్‌రెడ్డి, కన్వీనర్ ముత్యం వెంకన్నగౌడ్, కో కన్వీనర్ సి. భాను ప్రకాశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేందర్, సోమయాజులు, ఎం. విజయ్‌కుమార్, పి.యాదగిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగులు

బుల్లెట్‌పై.. టాంటాం..!

అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన స్పీకర్ హోదాలో కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో వికారాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి తన బుల్లెట్ బైక్ నంబర్ ప్లేట్‌పై 'వికారాబాద్ ఎమ్మెల్యే గారి తాలూకా..' అని రాయించుకోవడాన్ని చూసి పట్టణ ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. యూత్ కాంగ్రెస్.. వికారాబాద్ ఎమ్మెల్యే గారి తాలూకా.. అని రాసి ఉండటంతో పాటు చెయ్యి గుర్తు వేయించుకుని తిరగడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. – వికారాబాద్

వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ) : గడిచిన నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశాల మేరకు నగరంలో దోమల నివారణ, దోమలతో వ్యాప్తి చెందే వ్యాధుల నియంత్రణకు విస్తృతంగా చర్యలు చేపడుతున్నట్లు చీఫ్ ఎంటమాలజీ డాక్టర్ రాంబాబు తెలిపారు. నీటి నిల్వ కాలనీలను గుర్తించి డెంగీ, చికున్ గున్యా, మలేరియా లాంటి వ్యాధులు ప్రబలకుండా యాంటీ లార్వా ఆపరేషన్ (ఏఎల్ఓ) ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. డెంగీ వచ్చిన ఇంటిని, దాని చుట్టు పక్కన గల 50 ఇళ్ల వరకు యాంటీ లార్వా ఆపరేషన్, పైత్రమ్ రసాయనాన్ని స్ప్రే చేస్తున్నట్లు తెలిపారు. గ్రేటర్‌లో ప్రజలకు దోమల నివారణ, వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్‌పై అవగాహన

సిటీబ్యూరో, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా సామాన్యులకు హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు ది తెలంగాణ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ప్రకటించింది. హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం, డ్రగ్స్ కంట్రోలర్ అథారిటీ (డీసీఏ) చేపడుతున్న చర్యలకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ తెలిపారు. ఔషధాలు విక్రయించే సమయంలో పాత ప్రిస్క్రిప్షన్లు తీసుకువస్తే మందులు ఇవ్వమని, రోగులకు రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ రాసిన ప్రిస్క్రిప్షన్ తీసుకువస్తేనే మందులను అందజేస్తామని పేర్కొన్నారు.